



శ్రీశైలం రిజర్వాయర్

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. పక్కనే శ్రీశైలం ఉన్నా ఇక్కడి ప్రాజెక్టులకు నీరు అందని పరిస్థితి. ఏటా వందల టీఎంసీల మేర నీరు వృథాగా సముద్రం పాలైంది. ఈ నీటిని ఒడిసిపట్టుకునేందుకు జగన్ ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధి చూపలేదు. పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు సామర్థ్యాన్ని 44 క్యూసెక్కుల నుంచి 80 వేల క్యూసెక్కులు తరలించేందుకు కాలువ వెడల్పు పనులు చేపట్టామని బీరాలు పలికింది. ఆ తర్వాత దానిని గాలికి వదిలేయడంతో ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నీటిని నిలువ చేసేందుకు దిగువన ఎక్కడా సరైన రిజర్వాయర్ లేకుండా నీటి తరలింపు సామర్థ్యం పెంపు పనులు చేపట్టడం వైసీపీ ప్రభుత్వం ముందు చూపులేమితనాన్ని స్పష్టం చేస్తోంది. ఇక వైసీపీ తీరు వల్ల లక్షల ఎకరాలకు సాగు నీరు అందకపోవడంతో పంటలు సరిగా పండక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు.

ఐదేళ్లూ మభ్యపెట్టారు..!



శిథిలమైన తెలుగు గంగ కాలువ

- వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రాయలసీమ
- సాగు నీటి ప్రాజెక్టులకు అందని నీరు
- అన్నదాతల ఇబ్బందులు పట్టించుకోని జగన్
- ఎక్కువ నీటిని అందిస్తామంటూ హడావుడి

నంద్యాల, జూలై 14(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో సముద్రంలోకి నీరు వృథాగా పోకుండా ఆ నీటిని ఒడిసిపట్టి రాయలసీమకు అందించేందుకు పోతిరెడ్డి పాడు విస్తరణ అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. అప్పటికి ఉన్న 44 వేల క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థ్యాన్ని 80 వేలకు పెంచుతామంటూ పోతిరెడ్డిపాడు విస్తరణ పనులను 2021 ఏప్రిల్‌లో ప్రారంభించింది. నీటి తరలింపు సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచాలంటే.. పోతిరెడ్డిపాడు తర్వాత బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీ వద్ద మొదలయ్యే ఎస్సార్బీసీ, తెలుగుగంగ, ఎస్కేప్ కాలువ నీటి తరలింపు సామర్థ్యాన్ని కూడా పెంచాలి. పోతిరెడ్డిపాడు కాలువ వెడల్పు పనులు చేపట్టకముందు ఎస్సార్బీసీ కాలువ సామర్థ్యం 22 వేల క్యూసెక్కులు, తెలుగుగంగ కాలువ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ కాలువ (నిప్పులవాగు) సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు వెరసి 44 వేల క్యూసెక్కులు. 2021వ సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఎక్కువ ఉండటంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా పూర్తిస్థాయిలో నీటిని దిగువకు వదిలింది. పోతిరెడ్డిపాడు నిర్వహణను సరిగా పట్టించుకోకపోవడంతో కాలువ సామర్థ్యం దెబ్బతింది. దిగువకు వదిలిన నీరు పాములపాడు - ఎర్రగూడూరు మధ్యలో ఎగదన్ని చుట్టు పక్కల ప్రాంతాలను ముంచేసింది. అలాంటి పరిస్థితుల్లో పోతిరెడ్డిపాడు, బానకచర్ల క్రాస్‌రెగ్యులేటరీ తర్వాత ఉన్న ఎస్సార్బీసీ, తెలుగుగంగ, ఎస్కేప్ కెనాల్ కాలువల వెడల్పు పనులు చేపట్టకుండా, కేవలం లైనింగ్ పనులు చేపట్టి 80 వేల క్యూసెక్కుల నీటిని ఎలా తరలించుకు వెళ్లడానికి ప్రయత్నించింది? అనే విషయం అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలకే తెలియాలి.

కాలువలు దెబ్బతిన్నా పట్టించుకోలేదు

శ్రీశైలం నీటిని తమిళనాడుకు తరలించేందుకు 1980లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, అప్పటి ఏపీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ పూనుకున్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుంచి సుమారు 406 కి.మీ కాలువలను తవ్వి చెన్నై కాలువలకు అనుసంధానం చేశారు. ఈ కాలువను తెలుగు గంగ పేరుతో ప్రస్తుతం పిలుస్తున్నా.. అప్పట్లో మద్రాసు (చెన్నై) ప్రధాన కాలువ అనేవారు. ఈ కాలువ మద్రాసుకు నీటిని అందించడమే కాకుండా రాయలసీమ రైతాంగానికి సాగునీటిని కూడా అందిస్తోంది. అయితే తెలుగుగంగ ప్రధాన కాలువతో పాటు బ్లాక్‌చానెళ్ల నిర్వహణ ఏమాత్రం సరిగా లేదు. ఇక తెలుగు గంగ బ్లాక్ చానళ్ల తూముల గేట్లు తుప్పుబట్టిపోవడంతో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం లేదు. తెలుగు గంగ ప్రధాన కాలువ బ్లాక్ చానెళ్లను పటిష్ఠ పరిచేందుకు రూ.420 కోట్లు మంజూరు చేయాలంటూ అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2022 అక్టోబరులో ఆళ్లగడ్డ మీటింగ్‌కు వచ్చిన సందర్భంగా సంబంధిత అధికారులు ఓ నివేదికను ఇచ్చారు. అయితే దీనిపై అప్పటి వైసీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక ఎస్సార్బీసీ, జీఎన్ఎస్ఎస్ కాలువల మొదటి, రెండో ఫేజ్ కాలువ లైనింగ్ పనుల కోసం రూ.1260 కోట్లకు పైగా ఖర్చు పెట్టినా, నాణ్యతా లోపం వల్ల నీరు విడుదల కాకముందే పలు చోట్ల దెబ్బతిన్నాయి. ఎస్కేప్ కాలువ ద్వారా 35 వేల క్యూసెక్కుల నీటిని కుందూ నది ద్వారా తరలించేందుకు చేపట్టిన వెడల్పు ప్రక్రియ అసలు ఏమాత్రం ముందుకు సాగలేదు.

నీరు నిలువ చేసే ప్రాజెక్టులు ఏవీ..?

పోతిరెడ్డిపాడు నీటి తరలింపు సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచేందుకు వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టింది. ఈ స్థాయిలో నీటిని తరలిస్తున్నపుడు వాటిని నిలువ చేసేందుకు సరైన రిజర్వాయర్లను నిర్మించడం, ఇప్పటికే నిర్మించిన ప్రాజెక్టులను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు అనువుగా ఉండేలా చర్యలు చేపట్టాలి. అంతేగాకుండా రిజర్వాయర్ల కింద ఆయకట్టు నీరందేలా సరైన కాలువల నిర్మాణాలు చేపట్టాలి. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ పనులేవీ చేయకుండానే 80 వేల క్యూసెక్కుల నీరు తరలింపు అంటూ గొప్పలకు పోయింది. వెలుగోడు ప్రాజెక్టు నుంచి తెలుగు గంగ కాలువ ద్వారా కడప జిల్లాలోని బ్రహ్మం సాగర్, నెల్లూరులోని సోమశిల ప్రాజెక్టుకు నీరు అందుతోంది. అలాగే ఎస్సార్బీసీ ద్వారా గోరుకల్లు, అవుకు రిజర్వాయర్‌కు అక్కడి నుంచి గండికోట, సర్వారాయర్ రిజర్వాయర్‌కు నీరు తరలుతుంది. అలాగే కేసీ కెనాల్ ద్వారా అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు, కుందూ ద్వారా సోమశిల ప్రాజెక్టుకు నీరు అందుతుంది. అయితే వీటిలో ఎక్కువ శాతం ప్రాజెక్టులు వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. కడప జిల్లాలోని బ్రహ్మం సాగర్, సర్వారాయర్ రిజర్వాయర్లకు సరైన పంట కాలువలు లేకపోవటంతో ఆయకట్టు రైతాంగం నీరు అందక ఇబ్బందులు పడుతుంటే.. 2.965 టీఎంసీల సామర్థ్యం ఉన్న అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తిగా ఒట్టిపోయింది. అంతేగాకుండా రాయలసీమలో అరకొరగా కొనసాగుతున్న సాగునీటి నిర్మాణాలను జీవో నంబరు 365 ద్వారా నిలిపివేసింది. ఐదేళ్ల వరకు వీటిపైన కొత్త ప్రతిపాదనలు చేపట్టకూడదన్న ఆంక్షలను విధించింది. దీనివల్ల పందికోన రిజర్వాయర్, దెబ్బతిన్న గోరుకల్లు రిజర్వాయర్ పనులకు అడ్డంకి ఏర్పడింది.

నిధులు కేటాయించని గత ప్రభుత్వం

రాయలసీమకు సాగు, తాగునీటిని అందించే చాలా ప్రాజెక్టుల నిర్వహణ కోసం గత ఐదేళ్ళ పాటు వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం నిధులు కేటాయించ లేదు. నిర్మాణ లోపాల కారణంగా కుంగిన అలగనూరు రిజర్వాయర్ బండ్ మరమ్మతుల కోసం 2021వ సంవత్సరంలో అధికారులు రూ.3.07 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఆ తర్వాత బండ్ మొత్తాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయంతో పెరిగిన అంచనా వ్యయంతో ప్రకారం రూ.25.08 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. 12.44 టీఎంసీల సామర్థ్యం ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా శ్రీశైలానికి వరద ఉన్న సమయంలో 38 టీఎంసీల నీటిని కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా తరలించే వీలుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ మట్టి ఆనకట్ట (ఎర్త్‌డ్యాం)కు గతేడాది జూన్‌లో 60 మీటర్ల పొడవు, 37 మీటర్ల వెడల్పున రాతిపరుపు (స్టోన్ రివిట్‌మెంట్) కుంగిపోయింది. దిగువన శాండ్ ఫిల్టర్, మెటల్ ఫిల్టర్ దెబ్బతిన్నాయని సంబంధిత అధికారులు అప్పట్లో తెలిపారు. ఇక వర్షాలు కురిసే సమయంలో ఆనకట్ట బయటివైపు పలుచోట్ల కోతకు గురై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం సరిగా నిధులు విడుదల చేయకపోవడంతో గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి బదులు 11 టీఎంసీల నీటిని నిలువ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక నంద్యాల, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలో 5.75 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడంతోపాటు, చెన్నై నగరానికి నీరందించేందుకు చేపట్టిన నిర్మాణం తెలుగుగంగ ప్రాజెక్టు ప్రాణాధారమైన వెలుగోడు రిజర్వాయర్‌దీ ఇదే పరిస్థితి. 16.95 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ రిజర్వాయర్ బండ్ అక్కడక్కడా కుంగిపోయింది. దీని మరమ్మతుతోపాటు ఎర్త్‌డ్యాం బండ్ బలోపేతం, మట్టికట్ట బయటివైపు కోతకు గురికాకుండా, స్పిల్‌వే గేట్ల మరమ్మతుల కోసం రూ.150 కోట్లకు పైగా అవసరమవుతాయని సంబంధిత అధికారులు అప్పట్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులను కేటాయించేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కనీసం చొరవ చూపకుండా రాయలసీమ సాగు, తాగునీటి విషయంలో పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు.



ఒట్టిపోయిన అలగనూరు

గతేడాది రాయలసీమ సాగు నీటి పరిస్థితి

గతేడాది తుంగభద్ర, సుంకేసుల, శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లకు ఎన్నడూ లేని విధంగా వరద వచ్చింది. కృష్ణా (తుంగభద్ర, వేదవతి, హంద్రీ ఉప నదులను కలుపుకుని) జలాల లభ్యతకు సంబంధించి 2022-23 సంవత్సరం రాయలసీమకు అనువైన నీటి ఏడాదిగా పరిగణించవచ్చు. శ్రీశైలం రిజర్వాయర్‌కు గతేడాది కృష్ణా, తుంగభద్ర ద్వారా 2017 టీఎంసీ వరద నీరు వచ్చి చేరింది. అయితే రాయలసీమలో నీటిని ఒడిసి పట్టుకునేందుకు సరైన ప్రాజెక్టులు లేకపోవడంతో పాటు ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ సరిగా లేకపోవడంతో వచ్చిన నీరంతా దిగువ సముద్రం పాలైంది. దీంతో రాయలసీమ సాగు భూములకు సరైన నీరు అందలేదు.



పోతిరెడ్డిపాడు వద్ద ఎగువ నదిలోకి తీసిన అప్రోచ్ కాల్వ దుస్థితి

అవుకు వాసికి అత్యున్నత పదవి

- ఒడిశా సీఈవోగా డాక్టర్ తిరుమలనాయక్
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



ఒడిశా రాష్ట్ర సీఈవో డాక్టర్ తిరుమలనాయక్

అవుకు, జూలై 14 : నంద్యాల జిల్లా అవుకు గ్రామానికి చెందిన డాక్టర్ తిరుమలనాయక్ ఐఏఎస్ విజయగాథ యువతకు స్ఫూర్తిదాయకం. గిరిజన కుటుంబంలో జన్మించి అట్టడుగు స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగి ఆదర్శంగా నిలిచారు. పశువైద్యాధికారిగా ఉద్యోగంలో చేరి పట్టుదలతో ఐఏఎస్ సాధించారు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)గా నియమితులైన ఆయన జన్మనిచ్చిన అవుకు గ్రామానికి అరుదైన గౌరవాన్ని తెచ్చిపెట్టారు. తిరుమలనాయక్ తాత దాసన్న, అవ్వ సుబ్బమ్మ సీతమ్మ తండా నుంచి వచ్చి అవుకులో స్థిరపడ్డారు. వీరు ఆవులను కాసుకుంటూ వాటికి వచ్చే రోగాలకు నాటు వైద్యం చేస్తూ జీవనం సాగించేవారు. ఈ దంపతులకు లక్ష్మమ్మ కూతురు సంతానం. ఈమెను అప్పట్లోనే 10వ తరగతి వరకు చదివించారు. 1965లో కూతురు లక్ష్మమ్మను గడివేముల మండలం లక్ష్మయ్య కుంట తండా (ఎల్కే తండా)కు చెందిన రాముడితో వివాహం జరిపించారు. వీరికి సౌభాగ్య శిరోమణిబాయి, హరిసేవియా నాయక్, తిరుమలనాయక్ సంతానం. అయితే లక్ష్మమ్మ అవుకులో ఉంటూ పిల్లలను చదివించి పెద్ద చేసింది.

తిరుమలనాయక్ విద్యాభ్యాసం

తిరుమలనాయక్ 1980లో అవుకులో జన్మించాడు. 1 నుంచి 5 వరకు అవుకు ప్రాథమిక పాఠశాలలో, 6నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎమ్మిగనూరు జవహర్ నవోదయ విద్యాలయం బనవాసి, అనంతరం ఐదేళ్ల కాలపరిమితిగల బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ కోర్సు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. 2004లో పశువైద్యాధికారిగా ఉద్యోగం సాధించి సంజామలలో పని చేశాడు. ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి సివిల్స్‌కు ప్రిపేరయ్యాడు. రెండు సార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లి విఫలమయ్యాడు. మూడో సారి 2008లో జాతీయ స్థాయిలో 450 ర్యాంకు సాధించి ఒడిశా క్యాడర్ నుంచి ఐఏఎస్‌కు సెలక్ట్ అయ్యాడు. 2009లో ముస్సోరిలో ట్రైనింగ్ తీసుకొని 2010లో ఒడిశాలోని బాలాసోర్ జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరాడు. 2011లో బంజీనగర్ జిల్లా సబ్ కలెక్టర్‌గా, 2012లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, 2013లో కందమాల్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. 2019లో లేబర్ కమిషనర్‌గా, 2023లో అడిషనల్ సీఈవోగా, 2024 జూలైలో రాష్ట్ర ఎన్నికల సీఈవోగా నియమితులయ్యారు.

పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన లక్ష్మమ్మ

తిరుమలనాయక్ తల్లి లక్ష్మమ్మ 1970లో ఏఎన్ఎంగా విధుల్లో చేరి పీహెచ్ఎన్‌గా పదోన్నతి పొంది 2007లో రిటైర్ అయ్యారు. తండ్రి రాముడు పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోకపోయినా తల్లి లక్ష్మమ్మ మొక్కవోని ధైర్యంతో కష్టపడి ముగ్గురు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దింది. మొదటి సంతానమైన కుమార్తె సౌభాగ్యశిరోమణిబాయి అనంతపురం జిల్లా ధర్మవరం ఎల్ఐసీ ఆఫీసులో ఏఏవోగా, రెండో కుమారుడు హరిసేవియా నాయక్ కడపలోని ఏపీ ఎస్పీడీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, మూడో కుమారుడు తిరుమల నాయక్ ఐఏఎస్ సాధించి ఒడిశా రాష్ట్ర సీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు.



ఒడిశా రాష్ట్ర సీఈవో తిరుమలనాయక్‌ను అభినందిస్తున్న అధికారులు (ఫైల్)

నేను సాధించిన విజయాలు అమ్మకే అంకితం

అమ్మ ఆనాడు బడిబాట పట్టించటంతోనే ఈరోజు మాకుటుంబ సభ్యులు ఈ స్థాయిలో ఉన్నారు. అమ్మ ప్రోత్సహించిన విధానం, నేర్పిన క్రమశిక్షణ, నేడు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. నేను ఇప్పటి వరకు సాధించిన విజయాలు అమ్మకే అంకితం. అట్టడుగు స్థాయిలో జీవనం సాగిస్తున్న గిరిజన పేద కుటుంబాలను ఆదుకునేందుకు నిత్యం శ్రమిస్తా. పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడతా. ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతోనే పని చేస్తున్నాను.

- డాక్టర్ తిరుమల నాయక్, ఒడిశా రాష్ట్ర సీఈవో

నా పిల్లలకు చదువు దేవుడిచ్చిన వరం



నా పిల్లలకు దేవుడు ఇచ్చిన వరం చదువు. ఆర్థిక ఇబ్బందులు, ఒడుదుడుకులు ఎదురైనా నిలదొక్కుకున్నాను. పిల్లలు కూడా నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా నా మదిలో మెదిలే కళలను నిజం చేశారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతోనే నా కుమారుడు తిరుమల నాయక్‌ను ఐఏఎస్ అధికారిని చేశాను. నాకు ఇంతకన్నా ఏం కావాలి.

-లక్ష్మమ్మ, రిటైర్డ్ పీహెచ్ఎన్, తిరుమల నాయక్ తల్లి

జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తాం

రాష్ట్ర మంత్రులు ఫరూక్, దుర్గేష్

నంద్యాల (నూనెపల్లె), జూలై 14: జిల్లాను ఏపీ టూరిజం హబ్‌గా మారుస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాల శివార్లలోని చిన్నచెరువు పార్కు టూరిస్టు రెస్టారెంట్‌ను మంత్రులు దుర్గేష్, ఫరూక్‌లు కలెక్టర్ రాజకుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ చిన్నచెరువును మరింత అభివృద్ధి చేయడంతోపాటు నంద్యాల చుట్టూ ఉన్న శైవ క్షేత్రాలన్నింటినీ కూడా అభివృద్ధి చేసి జిల్లాను ఏపీ టూరిజంగా తయారు చేస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పంచరామాలు ఎలా ఉన్నాయో ఈ ప్రాంతంలో నవనందులు కూడా అలాగే ఉన్నాయని, వాటన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలో శైవక్షేత్రాలు అధికంగా ఉన్నందున వీటన్నింటిని మరింత అభివృద్ధి చేసి తిరుపతి, శ్రీకాళహస్తి తరహాలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించి చర్యలు చేపడతామని చెప్పారు. నిధుల సమీకరణకు ఇబ్బంది లేదని, ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ వ్యక్తులను భాగస్వామ్యం చేసుకొని అభివృద్ధి చేస్తామన్నారు.

ఆకర్షించే రీతిలో అందుబాటులోకి తెస్తాం: మంత్రి ఫరూక్

నంద్యాలలోని చిన్నచెరువుపై ఉన్న పార్కును ఆకర్షించే రీతిలో అభివృద్ధిలోకి తీసుకు వస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. ఇదివరకే పార్కు నిర్మాణం, అందులోని వసతులు బాగున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ప్రజలకు అన్నివిధాలుగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. సమగ్రాభివృద్ధిలో నంద్యాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, డాక్టర్ రవికృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చిన్న చెరువు కట్టను పరిశీలిస్తున్న మంత్రులు ఫరూక్, దుర్గేష్, కలెక్టర్

ఆక్రమించెయ్.. ఆపేదెవరు?



ఆదోని దివాకర్ రెడ్డి నగర్‌లో రస్తాలో ఇంటి నిర్మాణం చేసిన వైసీపీ నాయకుడు

- వంక రస్తాలో ఇళ్లు నిర్మించిన వైసీపీ నాయకులు
- ఇందిరమ్మ గృహాలకు వెళ్లే రహదారికి అడ్డంగా గుడిసె వేసిన వలంటీర్
- గత వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా ఇంటి పట్టా మంజూరు
- మురుగు నీరు వెళ్లేందుకు దారి లేక కాలనీవాసుల అవస్థలు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 14: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు డబ్బు, పలుకుబడితో పాగా వేసేస్తున్నారు. వంక పోరంబోకు, డ్రైనేజీ, రహదారి, పంచాయతీ, ఆర్అండ్‌బీ.. ఇలా రూ.లక్షల విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. ఆదోని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దివాకర్ రెడ్డి నగర్ వంక రస్తా జాగాను వదల్లేదు. వైసీపీకి చెందిన నాయకులు పర్వతాపురంలోని ఓ వలంటీర్ ఏకంగా రోడ్డును ఆక్రమించుకొని గుడిసె నిర్మించుకున్నాడు. దివాకర్ రెడ్డి నగర్‌లో గతంలో టీడీపీ ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు అక్కడ పట్టాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించింది. బస్టాండ్ నుంచి దివాకర్ రెడ్డి నగర్‌లో నుంచి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ ఆర్టీసీ కాలనీలోకి వెళ్లేందుకు 36 అడుగుల రాస్తాను వదిలారు. రాస్తా ఖాళీ స్థలం ఉందని అదునుగా భావించి తమ వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఏకంగా రెవెన్యూ అధికారుల చేతనే పట్టా మంజూరు చేసుకున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామని భావించి రస్తా స్థలంలో ఇల్లే నిర్మించుకున్నారు. దీనిపై చుట్టుపక్కల వాళ్లు అభ్యంతరం తెలిపినా టౌన్ ప్లానింగ్ అధికారులు వారికే వత్తాసు పలికేశారు.

రస్తా చూపాలంటూ..

దివాకర్‌రెడ్డి కాలనీలో 150 పైగా నిరుపేదల నిర్వహిస్తున్నారు. కాలనీకి పక్కనే పెద్ద వంక ఉంది. టీడీపీ ప్రభుత్వం గతంలో అక్కడ ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి లేఅవుట్ వేసి పట్టాలు మంజూరు చేసింది. రహదారులు, కాలువలు, నీటి ట్యాంకర్ వెళ్లడానికి ఖాళీ స్థలం వదిలారు. దివాకర్ రెడ్డి నగర్‌లోని సర్వే నెంబర్ 367/ఏలో 219 పక్కన 35 అడుగుల రహదారిని వదిలారు. పట్టాదారు పాస్ పుస్తకంలో రస్తా, నీటి ట్యాంకు అని స్పష్టంగా ఉన్నప్పటికీ వైసీపీకి చెందిన రమేష్ తన బంధువు నారాయణ పేరు మీద పట్టా పుట్టించుకున్నాడు. ఇంటి నిర్మాణానికి అడ్డు చెప్పిన కాలనీవాసులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. కాలనీవాసులు అటువైపు వెళ్లేందుకు రహదారి లేక ఇళ్లలోని మురుగు నీరు కాలువలోకి వెళ్లేందుకు దారి లేక ఇళ్ల మధ్యనే నిలువ ఉంటుండడంతో రహదారి చూపించాలని పట్టుబట్టారు. అవేమీ పట్టించుకోకుండా ఏకంగా పురపాలక అధికారులు వేసిన బోరును ఆక్రమించుకొని ఇంటిని నిర్మించారు. దీనిపై అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి ఫిర్యాదు చేసినా ఆయనకే వత్తాసు పలికాడని కాలనీవాసులు వాపోయారు. ప్రస్తుతం అక్కడ ఆర్టీసీ కొత్త బస్టాండ్ ఉండడంతో స్థలం రూ.లక్షలు పలుకుతుండడంతో కబ్జాదారుల కన్ను పడింది. పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం ఇంటి నిర్మాణానికి ఏ విధంగా అనుమతులు ఇచ్చారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



దివాకర్ రెడ్డి నగర్‌లో రహదారిని ఆక్రమించుకోవడంతో ఇళ్ల మధ్యలోనే నిలిచిన మురుగు నీరు

రహదారినే ఆక్రమించుకున్న వలంటీర్

పట్టణ శివారు ప్రాంతమైన పర్వతాపురంలో గత ప్రభుత్వంలో పని చేసిన వలంటీర్ ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లే 40 అడుగుల రహదారినే ఆక్రమించుకున్నాడు. గుడిసెలు వేసుకున్నాడు. ఇందిరమ్మ గృహాల కాలనీవాసులు అభ్యంతరం తెలిపితే అధికార పార్టీ వలంటీర్‌నంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కాలనీవాసులు పురపాలక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి ఆధారాలతో వారికి సమర్పించి వెంటనే రహదారిలో నిర్మించిన గుడిసె తొలగించాలని కోరుతున్నారు.



ఆదోని పర్వతాపురం గ్రామంలో ఇందిరమ్మ గృహాలకు వెళ్లే రహదారిని ఆక్రమించుకొని వలంటీర్ వేసుకున్న గెడిసె

హోదా కోసం కేంద్రాన్ని నిలదీయండి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

కర్నూలు(అర్బన్), జూలై 14: ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబుకు నిలదీయాలని సీఎం మాజీ మంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ బాబురావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన జరిగి పది సంవత్సరాలైందని, జగన్, చంద్రబాబులు సీఎంలుగా రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సీఎ. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించాలని అన్నారు. గుండ్రేవుల తుంగభద్రడ్యామ్‌ల నిర్మాణాలు, హైకోర్టు బెంచ్, స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఎక్కడ అని ప్రశ్నించారు. మోదీకి సాష్టాంగ నమస్కారాలు పెట్టే వారు రాష్ట్ర ప్రజల గురించి ఎక్కడ ఆలోచిస్తారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా కోసం ఎంపీలు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకుంటే ఎందుకు కేంద్ర ప్రభుత్వం దిగిరాదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, అశోకరత్నం, సయ్యద్ నవీద్, లాజరస్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

చిరుతపులిని బంధించేందుకు చర్యలు

- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు
- అడ్డంకిగా మారిన ఎడతెరపిలేని వర్షం

మహానంది, జూలై 14: చిరుతపులిని బంధించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఇప్పటికే నల్లమల తీరం వెంబడి గతంలో చిరుతపులి సంచరించిన ప్రదేశాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. యాంటీ కోచింగ్ టీంకు చెందిన నలుగురు నిరంతరం మహానంది పరిసరాల్లో గస్తీ తిరుగుతూ చిరుతపులి పాదముద్రలను సేకరిస్తున్నారు. వీరితోపాటు ఎన్ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్ట్) బృందానికి చెందిన పది మంది చిరుతపులి కదిలికలపై ఇక్కడి పరిస్థితులను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు ఉన్నత స్థాయి అధికారులకు చేరవేస్తున్నారు. శనివారం అటవీశాఖ పీసీసీఎఫ్, వైల్డ్ లైఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్ మహానంది గోశాలను సందర్శించి ఇక్కడి తాజా పరిస్థితులను సిబ్బందితోపాటు దేవదాయశాఖ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఆయన రాకతో చిరుతపులిని బంధించే చర్యలు వేగవంతమయ్యాయి. అయితే గత రెండు రోజులుగా మహానంది పరిసరాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో చిరుతపులి కదలికలను కనుక్కోవడం సిబ్బందికి కష్టంగా మారింది. ఏదేమైనా త్వరలోనే ఎన్ఎస్‌టీఆర్ బృందానికి చెందిన సభ్యులు చిరుతపులిని పట్టుకుంటారని అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

నేడు సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల (కల్చరల్), జూలై 14: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని అన్నారు. అలాగే జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజ కవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

శ్రీశైలం, జూలై 14: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్ద చేరుకున్న జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప స్వామివారికి అభిషేకం నిర్వహించి భ్రమరాంబికా దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

పోలీస్‌లకు సవాల్‌గా వాసంతి అదృశ్యం కేసు

- ఎనిమిది రోజులైనా లభించని బాలిక ఆచూకీ
- తల్లిదండ్రులను విచారించిన పోలీసులు



ముచ్చుమర్రిలో పోలీస్ డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

నందికొట్కూరు/పగిడ్యాల, జూలై 14: వాసంతి అదృశ్యం కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. ఎనిమిది రోజులైనా బాలిక ఆచూకీ దొరకలేదు. వాసంతి బంధువులు, తల్లిదండ్రులను ఆదివారం తెల్లవారుజామున పోలీస్‌లు నందికొట్కూరు, జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్లకు తీసుకొనిపోయి విచారించారు. బాలిక తల్లి సుజాత, తండ్రి మద్దిలేటిని వేరువేరుగా విచారించారు. బాలిక ఎన్ని గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చింది.. తల్లిదండ్రులు ఎక్కడెక్కడ వెతికారు.. వెంట ఎవరిని తీసుకుపోయారు.. వంటి వివరాలు అడిగినట్లు తెలిసింది. బంధువుల్లో ఎవరైనా క్షుద్రపూజలు చేసే వారు ఉన్నారా అని అడిగినట్లు సమాచారం. అలాగే బాలిక ఇంటి పరిసర ప్రాంతాలలో ఉంటే ఓ మహిళ గురించి ఆరా తీసినట్లు తెలిసింది. బాలిక తల్లిదండ్రులకు ఏఏ ఊరిలో బంధువులు ఉన్నారో వారి ఇళ్ల వద్ద సంబంధింత పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో విచారించినట్లు సమాచారం.

మరోసారి డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

పగిడ్యాల: మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి ఆచూకీ కోసం ఆదివారం మరోసారి పోలీస్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. బాలిక ఇంటి నుంచి డాగ్ ప్రధాన రోడ్డు వెంట వెళ్లి పాత ముచ్చుమర్రిలోని పార్కులో అటు ఇటు తిరిగింది. అక్కడి నుంచి ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకునే సరికి వర్షం కురవడంతో పోలీస్‌లు వెనుదిరిగారు. వాసంతి హత్యకు సంబంధించిన సంఘటనపై ఆదివారం సీఐ నాగరాజరావు ఆటో డ్రైవర్లను విచారంచారు. ఆటో డ్రైవర్లను ఒక్కొక్కరిని పిలిచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కు సమీపంలోని బస్టాండ్ ఆవరణంలో లటోలు నిలపడం వల్ల బాలిక ఎవరికైనా కనిపించిందా.. అనుమానాస్పందగా ఎవరైనా ఇక్కడ సంచరించారా అనే విషయాలపై ఆరా తీశారు. గ్రామంలో ఎనిమిది రోజులుగా బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా సమాచారం తెలిస్తే పోలీస్‌లకు తెలియజేయాలని కోరారు.

విచారణలో పాత అధికారులు

వాసంతి కేసును విచారించేందుకు నందికొట్కూరు, ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లలో గతంలో పని చేసిన సీఐ, ఎస్ఐలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. నందికొట్కూరు సీఐగా పని చేసిన నాగరాజరావు, ముచ్చుమర్రిలో ఎస్ఐగా పని చేసిన శ్రీనివాసులులతోపాటు రెండు ఉభయ జిల్లాల్లోని సీఐలు, ఎస్ఐలను విచారణ అధికారులుగా నియమించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. వాసంతి ఇంటి నుంచి బయలుదేరిన డాగ్ పాత ముచ్చుమర్రి గ్రామంలోని పార్కులో తిరిగి అక్కడి నుంచి నెహ్రూనగర్ రోడ్డు మీదుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద వరకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆఖరి చూపైనా చూసుకుంటాం

- మా పాపను అప్పగించండి
- రోధిస్తున్న వాసంతి తల్లిదండ్రులు

నందికొట్కూరు: ఆఖరి చూపైనా చూసుకుంటాం తమ బిడ్డను చూపించాలంటూ వాసంతి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఎనిమిది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి తల్లిదండ్రులు మద్దిలేటి, సుజాతమ్మలు గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. ప్రతి రోజు పాప చేసిన అల్లరి, ముచ్చట్లను జ్ఞాపకం చేసుకుంటూ బోరున విలపిస్తున్నారు. ఇప్పటికైనా పాప ప్రాణాలతో ఉంటే తీసుకు రావాలని, జరగరానిదేదైనా జరిగి ఉంటే ఆఖరి చూపైనా పాపను చూసుకుంటామని అంటున్నారు.



వాసంతి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



ముచ్చుమర్రిలో ఆటో డ్రైవర్లను విచారిస్తున్న సీఐ నాగరాజరావు

బాలుడి కిడ్నాప్

కర్నూలు, జూలై 14: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్దూరు నగర్ సమీపంలో అబ్దుల్ రెహిమాన్ అనే బాలుడు కిడ్నాప్‌కు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాలకు చెందిన సుంకన్న, షేక్ అమీనాలు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కొడుకులు, కూతురు సంతానం. బతుకుదెరువు కోసం వీరిద్దరు పది రోజుల క్రితం కర్నూలు వచ్చారు. సమీపంలో చెత్తకాగితాలు వేరుకుంటూ జీవిస్తున్నారు. శనివారం రాత్రి వర్షం పడుతుండటంతో మద్దూరు నగర్‌లో ఉన్న హనీఫ్ ట్రేడర్స్ షాపు ముందు భార్యా పిల్లలతో కలిసి పడుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు అబ్దుల్ రెహిమాన్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఒక ఆటోలో వచ్చిన కొంత మంది వ్యక్తులు ఆ చిన్న బాలుడిని కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. ఆటో నెంబరు ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, జూలై 14: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. కల్యాణ కట్టనందు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. క్షేత్రపరిధిలోని సత్రసముదాయాలు రద్దీగా కనిపించాయి.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



ఘనంగా సుదర్శన జయంతి వేడుకలు

ఆళ్లగడ్డ, జూలై 14: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం సుదర్శన జయంతి వేడుకలను పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ సమక్షంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామీ, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు అనంతరం సుదర్శన జయంతి హోమాన్ని భక్తుల సమక్షంలో చేపట్టారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

నేడు స్వాతి వేడుకలు

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆదివారం చెప్పారు. ఈ వేడుకల్లో భాగంగా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తామన్నారు.

కాటసాని నుంచి ప్రాణ హాని

రక్షణ కల్పించాలని ఎస్పీలకు మల్లెల రాజశేఖర్ విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), జూలై 14: వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన కొడుకు కాటసాని శివనరసింహారెడ్డి, ఓర్వకల్లు మండలానికి చెందిన గుర్రాల చెన్నారెడ్డి, జీకే వెంగన్న, గోపాల్‌రెడ్డిల నుంచి తనకు ప్రాణహాని ఉందని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో కొనసాగిని లోటర్ బాషాతో కలిసి తన హత్యకు పైన పేర్కొన్న వారంతా పన్నాగం పన్నారని తెలిపారు. బాధ్యులను విచారించి తనకు న్యాయం చేయాలని రెండు జిల్లాల ఎస్పీలను కోరారు. జిల్లాలో లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాటసాని నాలుక కోస్తానని హెచ్చరించానని, గౌరు చరిత గెలుపునకు కృషి చేశానని దీంతో తనపై కక్ష కట్టారని అన్నారు. తన అడ్డు తొలగించుకునేందుకు హత్యకు వ్యూహం పన్నుతున్నారని ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడికే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెంటనే పోలీసు యంత్రాంగం స్పందించాలని, లేనిపక్షంలో డీజీపీ, రాష్ట్ర హోం మంత్రిని కలిసి తనకు రక్షణ కల్పించాలని కోరతానన్నారు. సమావేశంలో ఓర్వకల్లు మండలం కాపు సంఘం నాయకులు కేవీ మధు, తెలుగుదేశం పార్టీ నాయకులు చదువుల సుధాకర్‌రెడ్డి, మహబూబ్ బాషా, వడ్డె నారాయణ తదితరు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం: మంత్రులు



మంత్రులను సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 14: రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నట్లు మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, దుర్గేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, తిరుపతి ఎమ్మెల్యే ఆరిన శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నంద్యాలలో బలిజ సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బలిజ సంఘాల కళ్యాణ మండపం కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుర్రాల రవికృష్ణ, కళ్యాణ మండలపం కమిటీ అధ్యక్షుడు రాజారాం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రులు ఫరూక్, దుర్గేష్ తదితర నాయకులు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చే దిశలో అడుగులు వేయడం మొదలు పెట్టిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నిర్విరామంగా ప్రభుత్వ పాలనను గాడిలో పెడుతున్నారని అన్నారు. కూటమి విజయంలో కాపు, బలిజల సామాజిక వర్గం కీలక పాత్ర వహించిందని అన్నారు. కార్యక్రమంలో హాజరైన అతిథులను బలిజ సామాజిక వర్గీయులు ఘనంగా సన్మానించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, బలిజ సంఘాల నాయకులు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి



రంగన్న మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, జూలై 14: తెలుగుదేశం పార్టీలో కీలకంగా పని చేస్తున్న మాజీ సర్పంచ్ కురువ రంగన్న(80) మరణం టీడీపీకి తీరని లోటు అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు ఆదివారం ఇస్కాల గ్రామంలో రంగన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందారు. ఆయన కుమారుడు లింగస్వామిని, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఏరువ నాగేశ్వరరెడ్డి, వడ్ల కలీముల్లా, తిమ్మారెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు, గోవిందు, మధుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



ట్యాంక్ వద్ద పారుతున్న నీటిని చూపుతున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, జూలై 14: నందికొట్కూరులోని ఏబీఎం పాలెంలోని ఇందిరా నగర్‌లోని జీఎల్ఎస్ ట్యాంక్ బోరు గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తాగునీటి సమస్యను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మోటార్‌ను మరమ్మతు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు టీడీపీ నాయకుడు నిమ్మకాయల మోహన్, 22వ వార్డు ఇన్‌చార్జి కళాకర్, మహేశ్, అడివప్ప, భాస్కర్, జమ్ములయ్య, నవీన్, ప్రేమ్, బంగారు సూరి ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి'



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు రామన్న

ఆత్మకూరు, జూలై 14: నంద్యాల పట్టణంలో ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షులు మధుశేఖర్, జిల్లా నాయకులు శివ పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజాభివృద్ధికి యువశక్తి ఎంతో అవసరమని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత మద్యం, గంజాయి, పేకాట వంటి చెడు వ్యసనాలకు లోనవుతున్నట్లు వివరించారు. అదేవిధంగా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో యువత బాధ్యతలను గుర్తుచేసేలా ఈ నెల 27 నుంచి 30వ తేదివరకు రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ తరగతులకు యువత పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంగం నాయకులు జబివుల్లా, కాశీ, మౌలాలీ, అలి, వరాలు తదితరులు ఉన్నారు.

మోటారు విరాళం



మోటార్ విరాళం ఇచ్చిన రమేష్‌నాయక్

మహానంది, జూలై 14: మహానంది మండలం ఎంసీ ఫారంలోని మారెమ్మ తల్లి ఆలయానికి కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన రమేష్ నాయక్ రూ.30 వేల విలువ చేసే సబర్సబుల్ నీటి మోటార్‌ను విరాళంగా ఇచ్చినట్లు ఆలయ నిర్వాహకులు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆదివారం దాత మోటార్‌ను మెకానిక్ సాయంతో ఏర్పాటు చేయించారు. దీంతో ఆలయాన్ని దర్శించే భక్తులకు తాగునీటి సమస్య తీరిందన్నారు. దాతను పలువురు భక్తులు మెచ్చుకున్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి పెద్ద పీట

● పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

నంద్యాల (నూనెపల్లె), జూలై 14: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నంద్యాలకు వచ్చిన మంత్రి దుర్గేష్ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రముఖ దేవాలయాలు ఉన్నాయని వాటన్నింటిపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామన్నారు. దేవాలయాలతోపాటు ఆసియాలోనే రెండో అతి పొడవైన బెలుంగుహలు, సుందరమైన బిల్వ గుహలు, వాల్మీకి గుహలు, నంద్యాల జిల్లాలోనే ఉన్నాయని, ఈ ప్రాంతాల్లో రిసార్ట్స్ నిర్మిస్తామని వెల్లడించారు. పర్యాటకులను ఆకర్షించేలా ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. శ్రీశైలంలో 79 గదులతో ఉన్న రెస్టారెంట్‌ను ఆధునీకీకరించడంతోపాటు 42 కొత్త గదులను రూ.14.85 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. మహానందిలో 31 గదులతో, అహోబిలంలో 8 గదులతో రెస్టారెంట్ సౌకర్యం ఉందన్నారు. అహోబిలంలో మరో 31 నూతన గదులు, 4 డార్మెటరీలను రూ.5 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అహోబిలం దేవాలయానికి నిధులను విడుదలయ్యాయని వెల్లడించారు. అటవీ, దేవాలయ, పర్యాటక ఇతరత్రా శాఖలను అనుసంధానం చేసి పర్యాటక రంగ అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ప్రొటెన్షియల్ జిల్లా అని శిల్పారామంతోపాటు టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక మంత్రి చర్యలు తీసుకోవాలని సూచించానని చెప్పారు. నవ నందులు, నవ నరసింహాలు, శిలా సంపద, నల్లమల అటవీసంపద తదితర ప్రాముఖ్యత గల ప్రదేశాలు జిల్లాలో ఉన్నాయన్నారు. వీటన్నింటిని అభివృద్ధి చేయడంతోపాటు జిల్లాను టూరిజం రిసార్టుగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



నంద్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

మహానందిలో భక్తుల రద్దీ



గోపురాన్ని శుద్ధి చేస్తున్న సేవా సమితి సభ్యులు



మహానందిలో దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

మహానంది, జూలై 14: మహానందీశ్వరుని దర్శనం కోసం వేలాదిమంది భక్తులు ఆదివారం తరలి రావడంతో ఆలయం పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. శని, ఆదివారాలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి వివిధ వాహనాల ద్వారా భక్తులు శనివారం రాత్రే మహానందికి తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే పరమశివుని దర్శనం కోసం క్యూలో వేచి ఉన్నారు. కుటుంబ సమేతంగా ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతో పాటు పూల కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. ఓం నమఃశివాయ అనే శివనామ స్మరణతో మహానంది ఆలయం పరిసరాలు మార్మోగాయి.

ఆలయ శుద్ధి: మహానంది క్షేత్రంలో సంవత్సరోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో వేదపండితులు, అర్చకులు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనంతో ప్రారంభించారు. వివిధ రకాల మూలికలు, సుగంధ ద్రవ్యాలతో గర్భాలయం, అంతరాలయంతో పాటు ప్రాకారాలు, గోపురాలు, రాతి స్తంభాలు, మంటపాలు, ధ్వజస్తంభాలను మంత్రపూర్వకంగా, శాస్త్రబద్ధంగా శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం వేళ తొలి ఏకదశి పర్వదినానికి ముందుగా మహానందిలో ఏటా ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వేదపండితుడు చండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, సిబ్బంది, మన గుడి మన ఊరు మన బాధ్యత సేవా సమితికి చెందిన 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 14: శ్రీశైల మహా క్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకిలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

నృత్య ప్రదర్శన: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడకు చెందిన నటరాజ నృత్య కళాపీఠం బృందంతో పేరిణీ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, గంగాధర, శివాష్టకం, అర్ధనారీశ్వరం, భో..శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

గుర్తించడానికి ఇంకెన్ని రోజులు కావాలి?

● పోలీసుల తీరుపై వాల్మీకి సంఘం నాయకుల ఆగ్రహం

నందికొట్కూరు, జూలై 14: ముచ్చుమర్రికి చెందిన వాసంతి అనే బాలిక కనిపించకుండా పోయి ఎనిమిది రోజులవుతున్నా ఇంత వరకు పోలీసులు గుర్తించలేదని, ఇంకా ఎన్ని రోజులు కావాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నందికొట్కూరు పోలీస్ స్టేషన్ ముందు వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బాలిక చనిపోయిన తల్లిదండ్రులను తీసుకొని వచ్చి పోలీసులు విచారణ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. హోంమంత్రి అనిత ముచ్చుమర్రి గ్రామానికి వచ్చి బాలికకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆదివారం సాయంత్రంలోపు బాలిక ఆచూకీ తెలియజేయకపోతే సోమవారం నుంచి ఉద్యమ కార్యాచరణకు పిలుపునిస్తామని హెచ్చరించారు. అనంతపురం న్యాయవాది హరినాయుడు మాట్లాడుతూ బాలిక ఆచూకీ కనుగొనాలన్నారు. ఇన్ని రోజులవుతున్నా వాసంతి జాడ తెలియకపోవడం బాధాకరమన్నారు. శ్రీధర్, రాఘవేంద్ర, మధు గోపాల్, పవన్ కుమార్, చిన్ననాయుడు, రామసముద్రం శ్రీను, ధను, వసంత్, నాగేశ్వరరావు, గోపాల్, సుధాకర్, కంబగిరి రమణ, పరమేష్, మదన్‌గోపాల్, వెంకటేష్, హనుమప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో చిన్నారి వాసంతి అపహరణకు గురై ఎనిమిది రోజులు గడిచినప్పటికీ ఇంత వరకు జాడ తెలియకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రఘురామ్మూర్తి అన్నారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని పటేల్ సెంటర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రఘురాంమూర్తి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లలితమ్మ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముక్కుపచ్చలారని చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతుండటం దారుణమన్నారు. వాసంతి తప్పిపోయి ఎనిమిది రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పాప ఆచూకీని కనుగొనలేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చిన్నారి జాడను గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పాలని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఏఐటీయూసీ నాయకులు రాముడు, షేక్షావలి, వీరస్వామి, రామకృష్ణ, చాంద్‌బాషా, చిన్న తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించిన మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి నాయకులు



నందికొట్కూరులోని పటేల్ సెంటర్ వద్ద రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

రహదారి గుంతలమయం

కొత్తపల్లి, జూలై 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ఈ రహదారిని పట్టించుకోలేదు. గ్రామ నడిబొడ్డున ఉన్న బస్టాండు సెంటరులో రోడ్డు అస్తవ్యస్తమై మోకాల్లోతు గుంతలో బాటసారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో పర్యాయాలు గతంలో వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. నిత్యం ఈ రహదారి గుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కొలనుభారతి, సంగమేశ్వరం పుణ్యక్షేత్రాలకు భక్తులు వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలోనైనా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.



బస్టాండులోని రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర



జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 14: నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరె సారె సమర్పించుకుంటారు. ఆదివారం 9వ రోజు ఆషాడ మాసం సందర్భంగా జగజ్జననీ అమ్మవారికి అనంతపురం, ఐజ, గుంటూరు, డోన్, కర్నూలు, చాగలమర్రి, తాడిపత్రి, సత్తెనపల్లి, సంగపట్నం, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకొని వచ్చి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే



ఉప్పలదడియ గ్రామంలోని మొహర్రం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య, శివానందరెడ్డి

మిడుతూరు, జూలై 14: మండలంలోని ఉప్పలదడియ గ్రామంలో మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కమతం జయరామి రెడ్డి, వీరారెడ్డి, రాజశేఖర రెడ్డి, గ్రామస్థులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే జయసూర్యకు, శివానందరెడ్డికి ఘన స్వాగతం పలికారు. వారు గ్రామంలో వెలసిన చిన్న కాశిం, పెద్ద కాశిం పీర్లకు టెంకాయ సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాయకులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రమణ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ వేడుకను పురస్కరించుకుని ఈనెల 12వ తేది నుంచి పట్టణంలోని పెద్దపీర్లు, పెద్దబజారు, గొల్లపేట తదితర ఏరియాల్లో వద్ద పీర్లను కొలువుతీర్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఉత్సవాల్లో భాగంగా 16వ తేది మంగళవారం చిన్నసరిగెత్తు, 17వ తేది బుధవారం పెద్దసరిగెత్తును జరపనున్నారు. అదేరోజు పెద్దపీర్ల ప్రాంగణం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. పెద్దసరిగెత్తు వేడుక అనంతరం పీర్లను పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు.

'జీపీఎస్ రద్దు చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 14: జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పురుద్ధరించాలన్న ఆకాంక్షకు విరుద్ధంగా గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీపీఎస్ అమలు చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసిందని, దీనిని రద్దు చేయాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ పట్టణ కార్యవర్గ సభ్యులు బత్తుల ఈశ్వరరెడ్డి, పుల్లయ్య నాయక్, రవితేజలు ప్లకార్డులు చేతబూని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాగ వెంకటేశ్వర్లు, గుర్రప్ప, జాని బాషా తదిరతులు పాల్గొన్నారు.

● గ్యారెంటీ పెన్షన్ స్కీం చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో చేసిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఉందని రద్దు చేసిన చంద్రబాబు ఉద్యోగుల మనో భావాలకు వ్యతిరేకంగా ఉన్న జీపీఎస్‌ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ సహకారం'



భవనాశి శ్రీనివాసను సన్మానిస్తున్న నిర్వాహకులు

నంద్యాల (కల్చరల్), జూలై 14: ఆర్యవైశ్యులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని రాష్ట్ర ఆర్యవైశ్య సముదాయాల సెక్రటరీ ఇల్లూరి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నంద్యాల వాసవీ భవన్‌లో జరిగిన నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్ష్మయ్య మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి అధికారిక ప్రకటన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అనాథ ఆర్యవైశ్య బిడ్డలకు చదువు విషయంలో ఎంత వరకైనా ఉచితంగా చదివిస్తామన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, వీరబొమ్మన సత్యనారాయణ, డాక్టర్ మధుసూదనరావు, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు బింగుమల్ల శ్యామ్‌సుందర్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గుండా నాగ సుప్రజ, డాక్టర్ గెలివి సహదేవుడు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతులమీదుగా నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటి సభ్యులను, లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ మధుసూదన్ , సీఏ సాధించిన మేడిశెట్టి ఉత్తిష్టసాయి, వైద్యరంగంలో ఉచితంగా సేవలు అందిస్తున్న సెవెన్ హిల్స్ మారుతీకుమార్‌ను, ముఖ్య అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

'కేశవరెడ్డిని బీజేపీలోకి చేర్చుకోవద్దు'

పాణ్యం, జూలై 14: కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డిని బీజేపీలోకి చేర్చుకోవద్దని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమూర్తి కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు, పేద ప్రజలనుంచి కోట్లాది రూపాయలు దండుకొని మోసం చేశారని అన్నారు. కేశవరెడ్డిని బీజేపీలో చేర్చుకోవడం వల్ల పార్టీకి నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేకపోగా కూటమిపై వ్యతిరేక ప్రభావం పడుతుందన్నారు. ఎంపీటీసీ రంగరమేష్, బీజేపీ మండల కన్వీనర్ మద్దిలేటి, జనసేన కన్వీనర్ జగదీశ్‌బాబు, సుబహాన్, సుబ్బకృష్ణ, సీతారాముడు, రమణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేసిన దూదెకుల సంఘం నాయకులు

చాగలమర్రి, జూలై 14: చాగలమర్రి మండలంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం దూదెకుల నూర్‌బాష సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు వాసవీ దస్తగిరి, ఉపాధ్యక్షుడు ఖాసీంవలి, మండల అధ్యక్షుడు లాలయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్తు


యర్రగుంట్లలో విద్యార్థినిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

శిరివెళ్ల, జూలై 14 : చదువుతో ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయ్ కుమార్ అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన పాఠశాల విద్యార్థిని సాజిదా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకు ఎంపిక కావడంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు సాజిదాను ఆదివారం ఘనంగా సన్మానించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లె నరసింహారెడ్డి

కోవెలకుంట్ల, జూలై 14 : దాతల సహకారం మరువలేనిదని విశ్రాంతి గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన సురేంద్ర కుమారుడు త్యాగరాధ దత్తకు ఆదివారం ప్రకృతి పీఠం, ప్రకృతిసేవ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. త్యాగరాజదత్త ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడని, అయితే ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన టీచర్ బాలన్న కుమారుడు డిప్యూటీ ఇంజనీరు జి.వెంకటసుబ్బయ్య విద్యార్థికి ఆర్థిక సాయం అందించారన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రుద్రవరం, జూలై 14 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంటు మలేరియా ఆఫీసరు వరప్రసాద్‌రెడ్డి, వైద్యురాలు జ్యోతి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఆటోనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆళ్లగడ్డ, జూలై 14: ఆళ్లగడ్డ తాలుకా ఆటోనగర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ చాంద్‌బాషా, ఉపాధ్యక్షుడిగా అల్లాబకాష్, కార్యదర్శిగా లోకేష్, సహాయ కార్యదర్శి ప్రసాదరెడ్డి, కోశాధికారి కారులుగా చాంద్‌బాషా, హుసేన్‌మియా, సలహాదారులుగా సుబ్రహ్మణ్యం, గయాస్, కోటేశ్వరావు, ఎస్‌కెచాంద్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా సుబహాన్, షాకిర్‌హుసేన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు జాకీర్, ఇస్మాయిల్, ఇగల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

డోన్(రూరల్), జూలై 14: డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 23 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలిసి సందడి చేశారు. 2000-2003 సంవత్సరానికి చెందిన బీ.కాం విద్యార్థులు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం కలిసి తమ ఆనాటి జ్ఞాపకాలను కళాశాలలో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులతో కలిసి డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. పూర్వ విద్యార్థులు గిరి కుమార్ రెడ్డి, కామేశ్వరరెడ్డి, రామలక్ష్మణ్, ఆర్‌సీ వెంకటేశ్వర్లు, నాగేశ్వర నాయుడు, రాజేశ్వర రెడ్డి, దివాకర్ రెడ్డి, రాజేశ్వరి, సుమతి, తదితరులు ఉన్నారు. అలాగే పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు సహకారం అందించిన వీఆర్వోలు రాజు, సునీల్‌ను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

డోన్(రూరల్), జూలై 14: టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించాలని డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎన్ భానుసింగ్ కోరారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఇటీవల పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు భూకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డిలను సంఘం నాయకులు సన్మానించారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు సభ్యులు గాలయ్య, గోపాల్, రామదాసు రెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అంతా అరాచకమే: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూలై 14: గత వైసీపీ ప్రభుత్వంలో అంతా అరాచక పాలన కొనసాగిందని టీడీపీ నాయకులు పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, బనగానపల్లె పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంబాబు విమర్శించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చి నెల రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎన్డీఏ పాలనపై రాద్ధాంతం చేస్తూ ప్రెస్‌మీట్లు పెట్టడం సిగ్గు చేటన్నారు. మైనార్టీలపై కోపంతో 70 శాతం పూర్తయిన షాదీఖానాను నిలిపివేసి ముస్లింలకు ద్రోహం చేసిన వ్యక్తి కాటసాని అని విమర్శించారు. గతంలో ఇంటికి పిలిపించి కాటసాని రామిరెడ్డి కుమారుడు ముస్లింలను కొట్టినప్పుడు మైనార్టీలు కనిపించలేదా అని ప్రశ్నించారు. మైనార్టీలపై ప్రేమ ఉంది కాబట్టే మంత్రి బీసీకి భారీగా ఓట్లు వేసి గెలిపించారన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలని టీడీపీ నాయకులు హితవు పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీ టీడీపీ అధ్యక్షుడు రాయలసీమసలాం, టీడీపీ నాయకులు కృష్ణానాయక్, అల్తాఫ్‌హుసేన్, సయ్యద్‌హుసేన్ నియాజి, అహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ భవనం
శిథిలం

- పైకప్పు కూలి పోకుండా కర్రల ఏర్పాటు
- దెబ్బతిన్న పోలీసు క్వార్టర్స్
- భయం గుప్పిట్లో పోలీసులు


పోలీసు స్టేషన్ భవనం పైకప్పు కూలిపోకుండా ఏర్పాటు చేసిన కర్రలు

చాగలమర్రి, జూలై 14: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ భవనం ప్రమాదకర స్థితిలో ఉంది. బ్రిటీష్ కాలం నాటి నిర్మాణం చెక్క దంతెలతో వేసిన భవనం కావడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలీసులు, సిబ్బంది దంతెలు, దూలాలు కూలకుండా అడుగు భాగాన కర్రలు ఏర్పాటు చేశారు. వాటి కిందనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని పోలీసులు భయం భయంగా ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నివసించేందుకు నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి పోలీసులు నివాసం ఉండేందుకు గతంలో క్వార్టర్స్ నిర్మించారు. భవనాలు లోపలి భాగం దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. దీంతో పోలీసులు అద్దె ఇళ్లలో ఉంటున్నారు. కొత్త భవనాలు నిర్మిస్తే పోలీసులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

● వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత

చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 5 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో 18 మంది కానిస్టేబుళ్ల విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం 7 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పని భారం అధికమై ఉన్న పోలీసులు ఇబ్బందికి గురౌతున్నారు. ఉన్న పోలీసులలోనే ఇద్దరు స్టేషన్‌లోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. రాత్రి పూట గస్తీ చేయడానికి కూడా వీలు లేదు. పోలీసు స్టేషన్‌లో ఖాళీగా ఉన్న కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేసి ప్రజలకు రక్షణ సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కొత్తగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా ఎస్పీ చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


చాగలమర్రిలో శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్


దెబ్బతిన్న భవనంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ ధ్యేయం: ఎమ్మెల్యే


భూమా అఖిలప్రియకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

శిరివెళ్ల, జూలై 14 : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని.. అది విజన్ ఉన్న నాయకుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట వద్ద జరిగిన కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులకు అందిస్తామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రెస్టారెంట్ నిర్వాహకుడు నాగరాజు, నాయకులు యామా గుర్రప్ప, ఫిదా హుసేన్, పీపీ లింగమయ్య, మురళి, బాలచంద్రుడు, రవి, లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి, శేష ఓబుళరెడ్డి, ఓబుళకొండారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఇస్మాయిల్, బీఎండీ రఫీ, సిద్ధిఖ్ పాల్గొన్నారు.

బుగ్గన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే దాడులు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

డోన్, జూలై 14: డోన్ నియోజకవర్గంలో తన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వైసీపీ గూండాలతో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, నివాసంలో వారు మాట్లాడుతూ ప్యాపిలి మండలంలోని పోదొడ్డి గ్రామంలో మాజీ మంత్రి బుగ్గన అనుచరులే మారణాయుధాలతో టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. డోన్ మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలోని టీడీపీ గ్రామ సర్పంచ్ మాధవయ్యపై వైసీపీ గూండాలు దాడులకు పాల్పడ్డారన్నారు. పోదొడ్డి సమీపంలో మాజీ మంత్రి బుగ్గన తన బినామితో కంకర క్రషర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున దోచుకోవడం జరిగిందని మండిపడ్డారు. క్రషర్ ఫ్యాక్టరీ నడుపుకోవాలంటే ఎమ్మెల్యే కోట్లకు పబ్బం కట్టాలని వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. మాజీ మంత్రి బుగ్గన అవినీతికి పాల్పడినందువల్లనే ఎన్నికల్లో ప్రజలు ఆయన్ను ఓడించారన్నారు. సమావేశంలో డోన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య ఉన్నారు.

ప్యాపిలి: వైసీపీ అక్రమాలను ప్రశ్నించినందుకే ఆ పార్టీ శ్రేణులు టీడీపీ వర్గీయులపై దాడులు చేశాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ విమర్శించారు. ఆదివారం ఆయన ప్యాపిలిలో మాట్లాడుతూ మాజీ మంత్రి బుగ్గన పోదొడ్డి పొలాల్లో అక్రమంగా కంకర క్రషర్ ఏర్పాటు చేశారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు టి.శ్రీను, రామ్మోహన్, చెల్లా వీర, నాగేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా చిన్న సరిగెత్తు

ప్యాపిలి, జూలై 14: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలో చిన్న సరిగెత్తు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లస్వాములకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే జలదుర్గం, చిన్నపూదిళ్ల, పెద్దపూదిళ్ల, వెంగళాంపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం చిన్న సరిగెత్తు వేడుకలను నిర్వహిచారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పోలీసు స్టేషన్ సమీపంలో కొలువుదీరిన హసన్, హుసేన్ పీర్ల ఊరేగింపు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పీర్లను పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. పీర్ల చావిడి ముందు అగ్నిగుండం ఏర్పాటు చేసి గుండం చుట్టూ పీర్లను తిప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ రమణయ్య పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు చేపట్టారు.

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామంలో చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల స్వాములను నూతన వస్త్రాలతో అందంగా అలంకరించి, గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో ఆదివారం చిన్నసరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల, పెద్దకంబలూరు, శ్రీరంగాపురం, వెలగలపల్లె, మందలూరు గ్రామాల్లో నిర్వహించారు. కొండమాయపల్లె గ్రామంలో రంఖాసింస్వామిని గ్రామోత్సవ వేడుకలు చేశారు.

సంజామల: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంజామలలో కొలువుదీరిన ఇమామ్ ఖాసీం పీర్లకు చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 10గంటల నుంచి స్వామివారి పీర్లను ఊరేగించారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో చిన్నసరిగెత్తు సందర్భంగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి సోదరులు ఆదివారం తెలుగుపేట పీర్లచావిడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తెలుగుపేట బెస్తసంఘం పిలుపు మేరకు ఇమాంఖాసీం పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుపేటకు బీసీ సోదరులు చేరుకోగానే బెస్త సంఘం వారు పూలమాలలతో స్వాగతం పలికారు.

● బనగానపల్లె మండలంలో ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బనగానపల్లె మండలంలోని అన్ని గ్రామాల్లోను చిన్నసరిగెత్తు వేడుకలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు పట్టణంలోని సీఐ కార్యాలయం పక్కన ఉన్న ఇమాంఖాసీం పీర్లవద్దకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని పూలచద్దాలు, దట్టీలు, గొడుగులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

● పట్టణంలోని మొహర్రం వేడుకల సందర్భంగా సీఐ కార్యాలయం పక్కన ఉన్న ఇమాంఖాసీం పీర్లవద్ద రోడ్లు భవనాల శాఖామంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పీర్ల వద్ద ఫతేహాలు, చపూల చద్దర్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్వర్‌సాహెబ్, టీఎస్ఆర్ రెడ్డి, సయ్యద్‌హుస్సేన్ నియాజి పాల్గొన్నారు.


ప్యాపిలిలో కొలువుదీరిన పీర్లు


బనగానపల్లె తెలుగుపేటలో పీర్ల చావిడి వద్ద పూజలు చేస్తున్న బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి


సంజామలలో ఇమామ్‌ఖాసీం పీర్లకు ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు


బనగానపల్లెలో పీర్లకు పూజలు చేస్తున్న ముస్లింలు


కొలిమిగుండ్లలో కొలువుదీరిన పీర్లు


రుద్రవరం: కొండమాయపల్లెలో పీర్ల ఊరేగింపు


చాగలమర్రిలో హసన్, హుసేన్ పీర్ల ఊరేగింపు

నిత్యాన్నదాన సత్రానికి రూ.30 వేలు విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె, జూలై 14: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయ నిత్యాన్నదాన సత్రానికి దాతలు ఆదివారం రూ.30వేలు విరాళం అందించారు. టంగుటూరుకు చెందిన నాగమ్మకుదారుడు మురళీకృష్ణ, ఓబుళమ్మ దంపతులు నిత్యాన్నదాన కార్యక్రమానికి తమ వంతుగా ఆలయ కమిటీ చైర్మన్ రామగంగిరెడ్డికి ఈ విరాళం అందించారు. కార్యక్రమంలో తరుణ్, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో పేదలకు భరోసా


మాట్లాడుతున్న బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, జూలై 14: సీఎం చంద్రబాబు పాలనలో పేదలకు ఆర్థిక భరోసా వచ్చిందని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బీసీల సంక్షేమం విస్మరించారని అన్నారు. సీఎం చంద్రబాబు బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. 50 సంవత్సరాలకే పింఛన్ హామీని కల్పిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఉచిత ఇసుకను అందించేలా సీఎం నూతన పాలసీని అమలు చేశారని అన్నా రు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, చిన్నకృష్ణయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


చాగలమర్రిలో పేదలకు పుస్తకాలు అందజేస్తున్న ఆవోపా అధ్యక్షుడు రాజేష్

చాగలమర్రి, జూలై 14: చాగలమర్రి గ్రామంలోని పట్టాభిరామాలయంలో ఆవోపా ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఆవోపా అధ్యక్షుడు సుంకు రాజేష్ ఆదివారం అందజేశారు. జిల్లా ఆవోపా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పుస్తకాలను మంజూరు చేయడంతో వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఆవో పా కార్యదర్శి రవి, కోశాధికారి సునిల్‌కుమార్, ఆవోపా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, ఆనంద్‌బాబు, సాయి సుదర్శన్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు సాామూహిక వడిబియ్యం

చాగలమర్రి, జూలై 14: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి, కోదండరామ ఆలయాల్లో ఆషాడమాసం సందర్భంగా సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు చీర, సారె, పసుపు,కుంకుమలతో ఊరేగింపు చేశారు. శాకాంబరి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


టీడీపీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ప్రజా వైద్యశాల మల్లికార్జున

డోన్, జూలై 14: సీఎం చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర అభివృద్ధి ముందుకు వెళ్తుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున అన్నారు. ఆదివారం మంగళగిరిలో టీడీపీ కేంద్రం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మల్లికార్జున మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ప్రజల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడానికి బీసీలు ఎంతో కృషి చేశారని, కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడ్ని కోరినట్లు మల్లికార్జున తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలి

కొలిమిగుండ్ల, జూలై 14: కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ సునితాభాయి సూచించారు. అధికారులు కార్యక్రమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వినతులు అందజేయాలన్నారు.

వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఏర్పాటు


డోన్‌లో నూతన ఏర్పాటైన వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం కమిటీ

డోన్, జూలై 14: పట్టణంలోని గాయత్రీ పీఠం ఆవరణలో ఆదివారం వేద గాయత్రి బ్రాహ్మణ నూతన సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటి గౌరవాధ్యక్షులుగా శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అధ్యక్షులుగా నంద్యాల శంకర శర్మను ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఏవీరావు, కన్వీనరుగా గంగాధర శాస్త్రి, కార్యదర్శిగా శ్రీనివాస్‌తోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. న్యాయ సలహాదారులుగా హరిమురళీధర్‌రావు, శేష శయన రావు, కానాల మహేష్‌లను ఎన్నుకున్నారు. ఇదివరకు ఉన్నటువంటి బ్రాహ్మణ సంఘాన్ని రద్దు చేసినట్లు న్యాయ సలహాదారులు తెలిపారు. నూతన కమిటీకి బ్రాహ్మణ సంఘం అసియేషన్ నాయకులు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు అభినందనలు తెలిపారు.

నిందితులను శిక్షించాలి

డోన్(రూరల్), జూలై 14: చిన్నారి వాసంతి ఘటనలోని నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పజెప్పాలన్నారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్ఏ చిన్న రెహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ వద్దు

బనగానపల్లె, జూలై 14: జీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జీపీఎస్ విధానం వల్ల ఉపాధ్యాయుల జీవితాలు అగమ్య గోచరంగా తయారవుతాయన్నారు. ఈనెల 16న జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, అధ్యాపకుడు వీరన్న, పోలియానాయక్, రమేశ్, శేఖర్, రఫి పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ర్యాంపులు నిర్మిస్తాం


సీసీ రోడ్లను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 14: బనగానపల్లె పట్టణంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, మదర్‌థెరిసా చర్చి ఎదురుగా ఉన్న కల్వర్టులకు సొంత నిధులతో ర్యాంపులు నిర్మిస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం హామీ ఇచ్చారు. పట్టణంలోని పలు కాలనీల్లో బీసీ రాజారెడ్డి పర్యటించారు. బీసీ, ఎస్సీ కాలనీ, మదర్‌థెరిసా కాలనీల్లో సీసీ రోడ్లకు కల్వర్టులు నిర్మించాలని కోరారు. సీసీ రోడ్లు ప్రధాన రహదారికి ఎత్తుగా ఉండడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బంది పడుతున్నట్లు కాలనీవాసులు రాజారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని భరసా ఇచ్చారు.